సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం। 12। ఆగస్టు। 2023



వరుణుడు కరుణించాలని పూజలు
వరుణుడు కరుణించాలని పులి గుమ్మి వద్ద రైతులు, ట్రాక్టర్ యజమానులు పూజలు చేసి, వంటావార్పు నిర్వహించారు. IIలో



ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు
సింగర్భ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో రైతులు ప్రకృతి విధానంలో వరి సాగుకు శ్రీకారం చుట్టారు. IIలో



పక్కాగా ఓటర్ల సర్వే
జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంటింటా ఓటర్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. IIలో

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

రంపచోడవరం: స్థానిక బస్టాండ్ సమీపంలోని యూబీఐ బ్యాంక్ ప్రాంగణంలో శనివారం వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమం అనంతరం రంప పంచాయతీలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ రంపచోడవరం మండల కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర కోరారు.

పద్మాపురం గార్డెన్ వెలవెల



నిర్మానుష్యంగా పద్మాపురం గార్డెన్

అరకులోయ టౌన్: ఆంధ్రా ఊటీ అరకులోయలోని ప్రముఖ సందర్శిత ప్రాంతాలు వెలవెల బోతున్నాయి. అరకులోయలోని హోటళ్లు, లాడ్జీలు ఖాళీగా ఉంటున్నాయి. వర్షాల కారణంగా అరకులోయకు వచ్చే పర్యాటకుల సంఖ్య బాగా తగ్గింది. సీజన్‌లో రోజుకు రూ.60 వేల ఆదాయం రాగా ప్రస్తుతం వారం రోజుల్లో కనీసం రూ.లక్ష కూడా రాలేదని పద్మాపురం, గిరిజన మ్యూజియం ఆదాయ వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

డీడీ దృష్టికి ఉద్యోగుల సమస్యలు



డీడీ కొండలరావును కలిసిన టీడబ్ల్యూ టీచర్స్ యూనియన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావును శుక్రవారం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం కలిసింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు కుర్తాడి రామారావు, ఉమ్మడి విశాఖ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంబిడి నీలకంఠం, మాసాడ శోభన్, ఇతర ప్రతినిధులు జీవీవీ ప్రసాద్, ఎం.మోహన్‌బాబు, ఉపేంద్ర డీడీకి పలు సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. ఎస్జీటీల పదోన్నతులు, స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లింపులు తదితర అంశాలపై డీడీ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

13న ఎన్‌సీఎల్‌టీ జ్యుడీషియల్ సభ్యుడి రాక

మహారాణిపేట: నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) జ్యుడీషియల్ సభ్యుడు డాక్టర్ ఎన్.వెంకట రామకృష్ణ బదరీనాథ్ ఈ నెల 13న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఆ రోజు ఉదయం 10.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు విమానంలో తిరిగి హైదరాబాద్ వెళతారు.

కారు, స్కూటీ ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన యువకుడు

అనంతగిరి: మండలంలోని తుమ్మనవలస గ్రామ సమీపంలోని శుక్రవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న కారు, స్కూటీ ఢీకొన్న ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. భీంపోల్ పంచాయతీ చిమిడిపల్లి గ్రామానికి చెందిన యువకుడు మాదల సీతయ్య స్కూటీపై కాశీపట్నం నుంచి తుమ్మవవలస వైపు వస్తుండగా, అరకు నుంచి ఎదురుగా వస్తున్న పర్యాటకుల కారు ఢీకొట్టింది. స్కూటీపై ప్రయాణిస్తున్న సీతయ్య రోడ్డుపై ఎగిరిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంలో క్షతగాత్రుడిని ప్రైవేటు వాహనంలోని ఎస్‌కోట ఆస్పత్రికి తరలించారు.

భూతల స్వర్గం

ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ప్రకృతి అందాలకు **నెలవైన** దుడుమ జలపాతం పర్యాటకుల**కు** స్వర్గధామం. ఎటుచూసినా దట్టమైన అటవీప్రాంతం.. అత్యంత ఎత్తయిన కొండల నడుమ నుంచి జాలువారే జలపాతం.. మరోపక్క పర్యాటకులను కట్టిపడేసే మంచు అందాలు. ఈ ప్రాంతం పర్యాటకుల మదిలో గుర్తుండిపోయేలా ఒడిశా ప్రభుత్వం, ఇరు రాష్ట్రాల ఉమ్మడి మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్ అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేశారు. మళ్లీమళ్లీ ఈ ప్రాంతాన్ని సందర్శించేలా తీర్చిదిద్దారు.

- ఆకట్టుకుంటున్న దుడుమ అందాలు
- ఎటుచూసినా పచ్చదనం
- అత్యంత ఎత్తు నుంచి జాలువారే జలపాతం
- మరోపక్క మంచు అందాలు
- ప్రత్యేక నిధులు కేటాయించిన మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్, ఒడిశా ప్రభుత్వం
- పూర్తిస్థాయిలో వసతులు



అత్యంత ఎత్తులో ఏర్పాటుచేసి దుడుమ వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల సరిహద్దులోని దుడుమ జలపాతాన్ని సందర్శించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి పర్యాటకులు భారీగా వస్తుంటారు. అయితే ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. చెట్ల నీడను సేదతీరాల్సిన పరిస్థితి. వర్షం కురిస్తే నానా ఇబ్బందులు పడేవారు. ప్రమాదకర పరిస్థితుల మధ్య దుడుమ జలపాతం వద్దకు వెళ్లాల్సి వచ్చేది. సమస్యలను గుర్తించిన ఒడిశా ప్రభుత్వం, మాచ్‌ఖండ్ (ఏపీ, ఒడిశా జెన్‌కో) ప్రాజెక్ట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన జలపాతం పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇక్కడ సౌకర్యాలు లేక వెనుదిరిగే పర్యాటకులు ప్రకృతి ఒడిలో సేదతీరేలా అభివృద్ధి చేశారు.

రూ.10 లక్షలతో..

దుడుమ జలపాతం వ్యూపాయింట్, మెట్ల మార్గం, పార్క్ పరిసరాలను రూ.10 లక్షలతో అభివృద్ధి చేశారు. ఇదే ప్రాంతంలో 'దుడుమ కాఫీ హౌస్'ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

- మెట్ల మార్గంలో రెండు వైపులా, వ్యూపాయింట్ చుట్టూ రక్షణ నిర్మాణం చేపట్టారు.
- జలపాతం వద్ద పార్కులో పర్యాటకులు వేచి ఉండేందుకు విభిన్నంగా కేంద్రాలు నిర్మించారు.
- వాహనాలు భారీగా వచ్చిన సందర్భంలో సమస్య తలెత్తకుండా పార్కింగ్‌కు ప్రత్యేకంగా ప్రదేశాన్ని కేటాయించారు.
- ఆధునిక హంగులతో గెస్ట్ హౌస్‌ను ఏర్పాటు చేశారు.

అత్యాధునిక విద్యుత్ దీపాలు..

- దుడుమ జలాశయం నుంచి దుడుమ జలపాతం, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి వెళ్లే మార్గంలో అత్యాధునిక విద్యుత్ దీపాలను ప్రాజెక్టు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే దుడుమ జలపాతం పరిసర ప్రాంతాల్లో దీపాల ఏర్పాట్ల పనులు పూర్తయ్యాయి. రాత్రివేళల్లో దుడుమ అందాలను వీక్షించేలా తీర్చిదిద్దుతున్నారు.

ఫైర్ క్యాంపులతో..

- దుడుమ పరసరాలు ఒక్కసారిగా మారిపోయాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యటకులు విద్యుత్ కాంతుల వెలుగులోనే రాత్రి వేళలో దుడుమ వద్ద ఫైర్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని ఉత్సాహంగా గడుపుతున్నారు. ఈ ప్రాంతంలో పరిసరాల శుభ్రత, పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక గిరిజనులకు అప్పగించారు. నిత్యం పర్యవేక్షణతో పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. పార్కింగ్ నిమిత్తం వాహనాన్ని బట్టి రూ.20 నుంచి రూ.50 రుసుం వసూలు చేస్తున్నారు.





మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్ అధికారులు, ఒడిశా ప్రభుత్వం నిర్మించిన మెట్ల మార్గం, ఏర్పాటుచేసిన షెల్టర్

తనివితీరేలా అందాలు

> దుడుమ జలపాతానికి గతంలో వచ్చినప్పుడు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం .ఇప్పుడు ఒడిశా ప్రభుత్వం, ప్రాజెక్టు అధికారులు చేసిన అభివృద్ధి పనులు చాలా బాగున్నాయి. ముఖ్యంగా దుడుమ జలపాతం వ్యూపాయింట్ వద్ద రక్షణ గోడ నిర్మించడం వల్ల ప్రమాదకర పరిస్థితులు నివారించగలిగారు. పర్యాటకులను ఆకర్షించేలా దుడుమ కాఫీ హౌస్ ఏర్పాటుచేశారు. మళ్లీమళ్లీ వెళ్లాలన్న అనుభూతి పొందాం.
> – వి. రఘువర్మ, పర్యాటకుడు, విశాఖపట్నం

గిరిజన నేతకు సముచిత స్థానం

- గవర్నర్ కోటాలో రవిబాబుకు ఎమ్మెల్సీ పదవి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల్లో ఆనందం



సాక్షి, పాడేరు: మాజీ ఎమ్మెల్యే, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి న్యాయం చేశారు. రాష్ట్ర గవర్నర్ కోటాలో ఎస్టీ విభాగం నుంచి ఎమ్మెల్సీగా డాక్టర్ కుంభా రవిబాబును ఎంపిక చేయడంతో ఈమేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. డాక్టర్ వైఎస్సార్ తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన సమయంలో రవిబాబు ఎస్.కోట ఎమ్మెల్యేగా పనిచేశారు. అప్పట్లో కుంభా రవిబాబు అసెంబ్లీ ఎస్టీ కమిటీ చైర్మన్‌గా పదవి చేపట్టారు. మహానేత మరణాంతరం ఆయన జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుంభా రవిబాబును రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించారు. ఇటీవల ఆ పదవి కాలపరిమితి పూర్తవడంతో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కుంభా రవిబాబు పేరును సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆయన నియామకంపై ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రజాప్రతినిధులు,పార్టీ నేతలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంకు రవిబాబు కృతజ్ఞతలు

గవర్నర్ కోటాలో ఎస్టీ విభాగానికి తనను ఎమ్మెల్సీగా కీలక పదవిలో నియమించి శాసనమండలికి పంపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డాక్టర్ కుంభా రవిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడంతో పాటు ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జీవితాంతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీగా అన్ని వర్గాల గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంతో పాటు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రవిబాబు తెలిపారు.

12,818 డ్వాక్రా సంఘాలకు రూ.8.54 కోట్లు

- జమచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 1.46 లక్షల మంది సభ్యులకు లబ్ధి
- కలెక్టర్ సుమిత్‌కుమార్



చెక్కును మహిళలకు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, బుల్లిబాబు

సాక్షి,పాడేరు: జిల్లాలోని 12,818 డ్వాక్రా సంఘాలకు చెందిన 1.46 లక్షల మంది డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నిధులు రూ.8.54 కోట్లు ప్రభుత్వం నాల్గోవ విడతగా జమచేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో వైఎస్సార్ సున్నా వడ్డీ నాల్గోవ విడత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి సంబంధించి డ్వాక్రా సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టీవీలో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు ఆయా సంఘాలకు రూ.8.54కోట్ల విలువైన సున్నా వడ్డీ మొత్తం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించిందన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా నాలుగేళ్లలో ప్రభుత్వం రూ.19.26 కోట్ల మేర డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమచేసిందన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళల సంక్షేమమే లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలను అమలుజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళి, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి పాల్గొన్నారు.

పల్లెల ముంగిటకు పోస్టల్ సేవల విస్తరణ

- అరకు సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర
- తూలంలో నూతన బ్రాంచ్ ప్రారంభం



తూలం గ్రామంలో పోస్టాఫీసు బ్రాంచిని ప్రారంభిస్తున్న ఐపీవో ఉపేంద్ర

పెదబయలు: గిరిజన ప్రాంతంలో అత్యంత మారుమూల ప్రాంతాల్లోని పల్లెల ముంగిటకు పోస్టల్ సేవలను విస్తరిస్తున్నామని అరకు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర అన్నారు. మండలంలోని అత్యంత మారుమూల ఇంజిరి పంచాయతీ తూలం గ్రామంలో శుక్రవారం పోస్టల్‌శాఖ నూతన బ్రాంచ్ ఆఫీసును ఆయన ప్రారంభించారు. అనంతరం పోస్టల్ సేవలు,పొదుపు ఖాతాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్‌శాఖలోని పొదుపు, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తూలం బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలో వనుగురాయి, కుమ్మిరిగుంట, సరియాపల్లి, వైసంపాడ, లువ్వాపల్లి, ఎర్రబయలు, జూలంపల్లి, లిచాబు, బొకిరిపనస, చీకటిపల్లి, గబుడుపుట్టు, చీకుపనస, గజ్జేడి, భీమునికొత్తూరు, డిసంపాడ, బొల్లిరాయి, దూడుపల్లి, గునలోవ, దొంతురాలు, మల్లేపుట్టు గ్రామాలకు ఉత్తరాల బట్వాడా జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల గిరిజనులంతా పోస్టాఫీసులో ఖాతాలు తెరిచి సేవలు పొందాలని ఆయన కోరారు.

గిరి రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- ఆర్‌బీకే, గ్రామ సచివాలయ భవనాల ప్రారంభం
- 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాల పంపిణీ



వంజరిలో రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: గిరి రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలో పాలమామిడి, వంజరి గ్రామాల్లో రైతు భరోసా కేంద్ర భవనాలు, సొలభం–2లో గొందిపాడు గ్రామ సచివాలయం భవనాన్ని ఆమె ప్రారంభించారు. మండలంలో రైతులకు 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రూ.7కోట్ల విలువైన 4,553 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను సిద్ధం చేసిందని తెలిపారు. జి.మాడుగుల మండలంలో 400 క్వింటాళ్ల వరి విత్తనాలు, 300క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేసినట్టు ఆమె పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్‌పర్సన్ సరస్వతి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, పాడేరు పీఆర్ డీఈ నరేస్, పీఆర్ ఏఈ మాణిక్యం,సీఐ సత్యనారాయణ, ఏవో పాత్రుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండం నాయుడు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వలంటీర్ మృతి



కిరణ్(ఫైల్)

ఎటపాక: మండలంలోని నంది గామ గ్రామ వలంటీర్ జ్వరం, పచ్చకామెర్లతో బాధపడుతూ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మురుమూరు గ్రామానికి చెందిన సోయం కిరణ్(21) గత వారం రోజులుగా జ్వరం, కామెర్లతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కామెర్లకు మందులు వాడుతున్నప్పటికీ వ్యాధి తీవ్రత తగ్గకపోవడంతో మెరుగైన చికిత్సకు భద్రాచలం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. వలంటీర్ మృతి పట్ల నంది గామ సచివాలయ సిబ్బంది, పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

657 మందికి షోకాజ్ నోటీసులు

- ముఖ ఆధారిత హాజరుపై వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం
- తీవ్రంగా పరిగణించిన కమిషనర్, కలెక్టర్
- చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఆదేశం

సాక్షి, పాడేరు: జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు,వైద్యసిబ్బంది ముఖ ఆధారిత హాజరును నిర్లక్ష్యం చేయడాన్ని ఏపీ కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. గతంలో అనేక సార్లు హెచ్చరించి, వేతనాలు కట్ చేస్తున్నా ఫలితం లేకపోవడంతో జిల్లాలోని 57మంది వైద్యులు, వివిధ స్థాయిలో పనిచేస్తున్న 600 మంది వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, కలెక్టర్ డీహెచ్‌వో జమాల్‌బాషాను ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంబంధిత వైద్యబృందాలకు మెయిల్ ద్వారా ఉత్తర్వులు పంపారు. రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

ప్రతి అర్జీ పరిష్కరించడమే లక్ష్యం

- జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శివశ్రీనివాస్,ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: స్పందన వినతులతో పాటు జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల పరిష్కరించడమే లక్ష్యంగా అన్నిశాఖ అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు జేసీ శివశ్రీనివాస్,ఐటీడీఏ పీవో వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్పందనతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందన్నారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు, గిరిజన సంక్షేమశాఖ, పంచాయతీరాజ్(ప్రాజెక్టులు), పంచాయతీరాజ్ ఈఈలు ఎంఆర్‌జి.నాయుడు, లావణ్యకుమార్, కొండయ్యపడాల్, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఐటీడీఏ ఏవో హేమలత పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- కొయ్యూరు మండలం క్రిష్టారం గ్రామానికి చెందిన ఎడెం శివ గృహనిర్మాణానికి సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని విన్నవించాడు.
- పెదబయలు మండలం అంబపడ గ్రామంలో తాగు నీటి పథకం, సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అదే ప్రాంతానికి చెందిన కె.ఎస్. కుమార్, మోహన్‌బాబు వినతి పత్రం అందజేశారు.
- ముంచంగిపుట్టు మండలం కుమడ పంచాయతీ పరిధిలోని కెందుగూడ, సిగ్గిమెట్ట, కిముడుపుట్టు, పిట్టగెడ్డ, దొరగూడ గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని కిల్లో రాందాస్, కోటేశ్వరరావు విన్నవించారు.
- పాడేరు ఐటీడీఏ వెనుక ఉన్న సిల్వర్‌నగర్‌లో సీసీ రోడ్డుతో పాటు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి వినతి పత్రం అందజేశారు.
- జి.మాడుగుల మండలం బొంజంగి, సాడెకు, పెదబయలు మండలంలోని చినగుల్లెలు, మర్రిపుట్టు గ్రామాలకు రోడ్లు నిర్మించాలని గిరిజనులు విన్నవించుకున్నారు.

ఉపాధ్యాయుల జాబితా తయారు చేయండి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్‌ల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలు, ఉపాధ్యాయుల వివరాలతో జాబితా అందజేయాలని పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. పీవో తన చాంబర్‌లో శుక్రవారం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్, ఏటీడబ్ల్యూవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను, సీఆర్‌టీలను సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రెండు ఐటీడీఏల పరిధిలోని విద్యార్థుల జాబితాను కూడా తయారు చేయాలన సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని, వారానికి రెండు రోజులు స్కిన్ లెస్ చికెన్ విద్యార్థులకు పెట్టాలన్నారు. టెండర్ దారుల నుంచి తాజా కూరగాయలు తీసుకుని విద్యార్థులకు వండి పెట్టాలన్నారు. విద్యతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీడీ జాన్ రాజ్, ఏటీడబ్ల్యూఓలు సుజాత, రామ తులసి, హాసిని తదితరులు పాల్గొన్నారు.

కామయ్యపేట రోడ్డుకు మోక్షం

- ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాలకు తీరనున్న కష్టాలు
- రూ.2.15 ట్లతో రోడ్డు నిర్మాణం
- శంకుస్థాపన చేసిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కామయ్యపేట రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: కామయ్యపేట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.15కోట్లు మంజూరు చేయడంతో తీగలవలస, మట్టుజోరు, తడిగిరి పంచాయతీలతోపాటు ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు అవస్థలు తప్పనున్నాయి. తడిగిరి జంక్షన్ వద్ద దిగుడుపుట్టు వంతెన నుంచి కామయ్యపేట వరకు ఈ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కామయ్యపేట రోడ్డు ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరుచేయించినట్టు ఆయన పేర్కొన్నారు. మండలంలో గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా 22 రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం నక్కలపుట్టులో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నేత పోయ రాజారావును ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు సీదరి సాంబ, పాంగి బేసు, పెనుమల రంజిత్‌కుమార్, కాకరి బొంజుబాబు, ఎంపీటీసీలు కొర్ర నాగరాజు, పరదాని భీమలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంతో సంతోషంగా ఉంది



> గతంలో రోడ్డు సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు గోతుల మయంగా మారడంతో అత్యవసర పరిస్థితుల్లో కూడా 108 వాహనం వెళ్లలేని పరిస్థితి ఉంది. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉంది. త్వరితగతిన పూర్తిచేస్తే కష్టాలు తప్పుతాయి.
> – కిల్లో సాధు, ఓలుబెడ్డా, తీగలవలస పంచాయతీ

క్లుప్తంగా

రెండు నామినేషన్ల తిరస్కరణ

డుంబ్రిగుడ : మండలంలోని కోల్లాపుట్టు పంచాయతీ రెండో వార్డు సభ్యుల నామినేషన్లు రెండు తిరస్కరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉమా శుక్రవారం తెలిపారు.

భూ వివాదంలో అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఘర్షణ

ఎటపాక: మండలంలోని తోటపల్లి గ్రామంలో భూ వివాదంలో అన్నదమ్ముల కుటుంబాల మధ్య శుక్రవారం ఘర్షణ జరిగింది. ఇటీవల వారి కుటుంబంలో వృద్ధురాలు మరణించింది. నాటి నుంచి అన్నదమ్ముల కుటుంబాల మధ్య భూ పంపకాల వివాదం కొనసాగుతోంది. ఈక్రమంలో అన్నదమ్ముల కుమారులు చల్లగురుగుల శివ, చల్లగురుగుల ముక్తేశ్వరావు మధ్య శుక్రవారం వివాదం జరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. టెంట్ ఇనుపరాడ్డుతో ముక్తేశ్వరరావు పొట్టలో శివ పొడివడంతో తీవ్ర గాయమైంది. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన భద్రాచలం, అక్కడ నుంచి కొత్తగూడెం తరలించి చికిత్స చేయిస్తున్నారు.బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె



ఊరేగింపులో భక్తులు

రంపచోడవరం: స్థానిక సంతమార్కెట్ లో వరసిద్ధి వినాయక ఆలయంలో శోభకృతనామ సంవత్సర అధికశ్రావణ మాస శుద్ధ ఏకాదశి సందర్భంగా శుక్రవారం కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు ఊరేగింపు నిర్వహించి సారె సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ పిఎన్ వీరభద్రరావు ఆధ్వర్యంలో చంద్రకళ బృందం సభ్యులు అర్చకులు ప్రసన్నకుమార్ భక్తులతో పూజలు జరిపించారు. ధర్మప్రచారసేవా భక్త బృందం సభ్యులు లక్ష్మి, సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వెంకట రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు: సందర్శకులను ఆకట్టుకునేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు, పద్మాపురం, మ్యూజియం అధికారులతో పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మాపురం గార్డెన్లో గిరితేజ్ పేరుతో క్యాంటిన్ ఏర్పాటు చేసి గిరిజన వంటకాలను పర్యాటకులకు అందించాలని సూచించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పద్మాపురం గార్డెన్లో నిర్మించిన ట్రీహట్‌ల పనులు ఈనెల 16లోగా పూర్తి చేయాలని సూచించారు. పద్మాపురం గార్డెన్లో వీడీవీకే, గిరిజన సహకార సంస్థ సంయుక్తంగా గిరిమార్ట్ ఏర్పాటు చేసి గిరిజన ఉత్పత్తులను, అటవీ ఉత్పత్తులను పర్యాటకులకు విక్రయించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. కొత్తవలస హెచ్ఎన్‌టీసీలో ఏర్పాటు చేసిన కాటేజీలకు పూర్తిస్థాయిలో విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొత్తవలసలో కాటేజీల పరిసరాల్లో 200 సిల్వర్ ఓక్ మొక్కలను ఈనెల 16వతేదీలోగా నాటాలని సూచించారు. చాపరాయి గెడ్డను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. చాపరాయి గెడ్డ వద్ద పాడేరు నుంచి వెళ్లే వారికి అటు అరుకు నుంచి వచ్చే వారికి వేర్వేరుగా కార్‌పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు వీఎస్.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, మ్యూజియం క్యూరేటర్ మురళి, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజిబాబు, గిరిజన సంక్షేమశాఖ ఏఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటింటా ఓటర్ల సర్వే

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంటింటా ఓటర్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 35 శాతం ఇంటింటా ఓటర్ల సర్వే జరిగిందన్నారు. మిగతా ప్రాంతాల్లో కూడా సర్వే పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఓటర్ల సర్వేకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని, బూత్‌ల వారీగా ఏజెంట్లను కూడా నియమించుకోవాలని సూచించారు. పీవీటీజీ ఓటరు నమోదుపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాకు 3100 వీవీ ప్యాడ్స్ చేరుకున్నాయని, వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామన్నారు. త్వరలోనే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు ఇక్కడికి చేరుకుంటాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో అంబేద్కర్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు వైస్ ఎంపీపీ శివకుమార్, సింహాచలం, సల్లా రామకృష్ణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

చినుకు పడేనా.. చింత తీరేనా

కురవని వర్షాలు.. ఆందోళనలో రైతులు



లబ్బర్తి గ్రామ శివారులో ఎండిపోతున్న వరి నారు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసరాల్లో ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. వర్ష రుతువు అయినప్పటికీ వర్షాలు కురవక పోగా పగటి పూట ఉష్ణోగ్రతలు 31 నుంచి 33 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వ్యవసాయ పనులు ముందుకు సాగక రైతులు తలలు పట్టుకొంటున్నారు. ఆగస్టు నెలలో ఇప్పటి వరకు వరుసగా ఒకటవ తేదీన 12.2 మి.మీ. రెండవ తేదీన 2.6 మి.మీ, 4వ తేదీన 3 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. ఆ తరువాత గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో వేలాది ఎకరాల్లో వరి సేద్యం ప్రశ్నార్థకంగా మారింది. వరి నారు మడులు నీరు లేక ఎండి పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో వేసిన నాట్లు నీరు అందక ఎండిపోతున్నాయని చెబుతున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో వర్షాలు కురవకపోతే ఖరీఫ్ నాట్లు మరింత ఆలస్యం అవుతాయని చెబుతున్నారు. మండలంలో 5,600 ఎకరాల్లో వరి సాగవుతుండగా ఇప్పటి వరకు సుమారు 2వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడినట్లు వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ఆగష్టు నెలాఖరు వరకు నాట్లు పడే సూచనలు ఉన్నట్టు పేర్కొన్నారు.

వరుణుడు కరుణకు పూజలు

రాజవొమ్మంగి: వరుణుడు కరుణించాలని రాజవొమ్మంగి అటవీప్రాంతంలోని పులి గుమ్మి వద్ద రైతులు, ట్రాక్టర్ యజమానులు శుక్రవారం పూజలు చేశారు. పసుపు కుంకుమలను నదీ పాయలో వదిలి ప్రార్థించారు. అక్కడే వంటా వార్పు చేపట్టి నదీపాయకు నైవేద్యం సమర్పించారు. అనంతరం వారంతా భోజనాలు చేశారు. ఇలా పూజలు చేసిన రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వారి నమ్మకం.

పకడ్బందీగా అత్యవసర వాహనాల నిర్వహణ

మహారాణిపేట: అత్యవసర సమయాల్లో ప్రజలకు ఉపయోగపడే 108, 104 వాహనాల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఆ విభాగం రాష్ట్ర ఫ్లీట్ హెడ్(ఆపరేషన్) వరప్రసాదరావు సూచించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎమర్జెన్సీ సేవలందిస్తున్న 108, మొబైల్ మెడికల్ సేవలు అందిస్తున్న 104 వాహనాల పనితీరుపై ఆయన వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వాహనాల్లో అన్ని సౌకర్యాలు పక్కగా ఉండాలని, వాహనాలు మరమ్మతులకు గురైతే తక్షణమే చేయించాలని వరప్రసాదరావు సూచించారు. సర్వీస్ షెడ్యూల్‌ను పాటించాలని, అత్యవసర మందులను అన్ని వేళల్లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.



అధికారి వర ప్రసాదరావుకు స్వాగతం పలుకుతున్న అధికారులు, సిబ్బంది

నైపుణ్యాభివృద్ధికి టీఆర్‌ఈఐతో గైస్ ఒప్పందం



టీఆర్‌ఈఐ కంపెనీ ప్రతినిధులతో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, కుమార్

మురళీనగర్(విశాఖ ఉత్తర): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాభివృద్ధికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు అచ్యుతాపురంలోని టయోట్స్ రేర్ ఎర్త్స్(టీఆర్‌ఈఐ) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఇండస్ట్రీ కనెక్ట్‌లో భాగంగా ఆ కంపెనీ ప్రతినిధులతో గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ సమక్షంలో కాలేజీ ప్రతినిధులు శుక్రవారం అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నారు. కరికులం డిజైన్, విద్యార్థులకు, ట్రైనర్లకు శిక్షణ, జాయింట్ సర్టిఫికేషన్, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక శిక్షణ, ఇండస్ట్రియల్ ట్రైనింగ్, గెస్ట్ లెక్చరర్స్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలను టీఆర్‌ఈఐ నిర్వహిస్తుందని ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండీ కోయిచీ సాతో, సీనియర్ జీఎం డాక్టర్ మురళీధరరావు, కాలేజీ టీపీవో కుమార్ పాల్గొన్నారు.

14న పాత ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో ఈ నెల 14న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2023 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్, జోన్–4 ఉపసంచాలకుడు ఆర్.జి.రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, ఐటీఐ పూర్తి చేసిన అన్ని ట్రేడుల అభ్యర్థులు, ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఎస్‌సీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఈ అప్రెంటిస్‌షిప్ మేళాలో కోరమండల్, మైలాన్, వరుణ్ మోటార్స్, జయభేరి, జిందాల్ స్టీల్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు 18కి పైగా ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువీకరణపత్రాలతో మేళాకు హాజరుకావాలని సూచించారు.

అప్రెంటిస్‌షిప్ మేళాకు విశేష స్పందన

నర్సీపట్నం: ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన అప్రెంటిస్‌షిప్ మేళాకు వివిధ ట్రేడులకు సంబంధించిన అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వారు శుక్రవారం ఐటీఐలో ఈ మేళా నిర్వహించారు. మేళాకు వచ్చిన 64 మంది విద్యార్థులకు రాత పరీక్ష పెట్టారు. రాత పరీక్ష అనంతరం సంస్థ జనరల్ మేనేజర్ రంగారావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ డి.శ్రీనివాసాచారి తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



గొర్లె రాజేశ్వరి(ఫైల్)

యలమంచిలి: మండలంలో పెద షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన గొర్లె రాజేశ్వరి (25) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సన్నిబాబు శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన శ్రీనుతో ఆమెకు వివాహమైంది. భర్తతో మనస్పర్థలు రావడంతో తన పుట్టింటికి వచ్చి ఉంటోంది. ఇటీవల తన తల్లి లక్ష్మితో గొడవ పడి గత నెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తిరుపతి యాత్రకు వెళ్లి..



శ్రీరామ్మూర్తి

కె.కోటపాడు: తిరుపతి యాత్రకు వెళ్లిన భర్త ఇంటికి తిరిగి చేరుకోకపోవడంతో శుక్రవారం ఎ.కోడూరు పోలీసులకు అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు చేసింది. ఎ.కోడూరు గ్రామానికి చెందిన కైచర్ల శ్రీరామ్మూర్తి (59) గత నెల 16న ఇంటి నుంచి తిరుపతి యాత్రకు ఏటా మాదిరిగానే ఒక్కడే బయలుదేరి వెళ్లాడు. 25 రోజులు గడుస్తున్నా జాడ లేకపోవడంతో ఆందోళన చెందినామె పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు



శంకులమామిడి గ్రామంలో లైన్ షోయింగ్ పద్ధతిలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ ప్రకృతి వ్యవసాయ విభాగం రైతుసాధికార సంస్థ ఎం.నిట్టాపుట్టు యూనిట్ అధ్వర్యంలో శుక్రవారం శంకుమామిడి, నిట్టాపుట్టు గ్రామాల్లో రైతులు వరిలో లైన్ షోయింగ్ పద్ధతిలో వరినాట్లు వేసారు. గిరిజన సంప్రదాయంతో మహిళలు గీతాలాపనలతో ఉత్సాహంగా వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులు పాటించి అధిక దిగుబడి సాధించాలన సూచించారు.

గంగవరం: మండలంలోని జగ్గంపాలెం యూనిట్ పాతరామవరం గ్రామంలో రైతు పోలోజు అంతర్లయ్య పొలంలో మోడల్ మేకర్ బలిజ నూకేశ్వరరావు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎటిఎం మోడల్ బెడ్స్ తయారు చేసి బీజామృతంతో విత్తనశుద్ధిను వివరించారు.వీపీఏలు, వీహెచ్‌ఎలు, వెంకటేష్, కాటమస్వామి, సురేష్, మహేష్, శ్రీను, దుర్గ, గొల్లబాబు, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఆడిట్‌తో వ్యాపారం సులభం

జీఎస్టీ ఇంటెలిజెన్స్ డీజీ ఎంఆర్‌ఆర్ రెడ్డి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎంఆర్‌ఆర్ రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: జీఎస్టీ ఆడిట్‌ను పాటించడం వల్ల వ్యాపారం సులభం అవుతుందని విశాఖ జోన్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ ఎంఆర్‌ఆర్ రెడ్డి అన్నారు. జీఎస్టీ డిపార్ట్‌మెంటల్ ఆడిట్ అనేది సంబంధిత సంస్థ రికార్డులు, రిటర్న్‌లు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించే ప్రక్రియగా పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం జీఎస్టీ డిపార్ట్‌మెంట్ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై సీఐఐ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. జీఎస్టీ విభాగం వినియోగదారులకు అనుకూలమని, దీనిపై తాము తరచూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆడిట్ ముగిసిన తర్వాత అధీకృత అధికారి గుర్తించిన విషయాలను 30 రోజుల్లో తెలియజేస్తారన్నారు. సీఐఐ విశాఖ చైర్మన్ పీపీ లాల్ మాట్లాడుతూ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై సంప్రదింపుల ద్వారా రిటర్న్ ఫైలింగ్ ఫార్మాట్‌ను సులభతరం చేయడం అభినందనీయమన్నారు. జీఎస్టీ ఆదాయంలో 22 శాతం వృద్ధి ఆర్థికాభివృద్ధిని సూచిస్తుందన్నారు. సీఐఐ విశాఖ ఫైనాన్స్, ట్యాక్సేషన్ ప్యానెల్ కన్వీనర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ రిటర్న్‌లను నిర్ణీత సమయానికి దాఖలు చేయడం అలవరచుకోవాలని సూచించారు. పీబీఎల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ చైర్మన్ పి.రాజేష్, హెచ్ఎన్ఏ అండ్ కో పార్టనర్‌లు ఆశీష్‌చౌదరి, విక్రమ్ కటారియా, సీఐఐ విశాఖ వైస్ చైర్మన్ గ్రంధి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రెండు నెలల్లో టిడ్కో గృహాలు



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

దొండపర్తి: విశాఖలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను రెండు నెలల్లో లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ రూపొందించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భానోజీతోట, అచ్చంనాయుడు లోవ, పెదగంట్యాడ బీసీ కాలనీ, మూలగాడ లే అవుట్లలో తుది దశకు చేరుకున్న టిడ్కో గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో భాగంగా రానున్న రెండు నెలల్లో టిడ్కో గృహ నిర్మాణ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మంచినీటి సౌకర్యాలతో పాటు డ్రైనేజీ, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తుది దశలో ఉన్న 10 వేల గృహాల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించే విషయంలో సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ డి.నరసింహమూర్తి, ఈఈ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఆప్షన్ల ఎంపిక ప్రారంభం

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీలో ప్రవేశానికి వెబ్ ఆప్షన్ల ఎంపిక కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. అభ్యర్థులు ఇంటి నుంచే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. అయినప్పటికీ కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలల్లోని హెల్ప్ లైన్ కేంద్రాలకు విద్యార్థులు వచ్చి.. వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహారావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వెబ్ ఆప్షన్లకు గడువు ఈ నెల 14వరకు ఉంది. 16న ఆప్షన్ల మార్పిడి చేసుకోవచ్చు. 18న సీట్ల కేటాయింపు, 19 నుంచి 23వ తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది.